సాక్షి
అనంతపురం

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి.



అంతటా అంజన్న నామస్మరణ

శ్రావణమాస మూడో శనివారం నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

8లో

గరిష్టం/కనిష్టం
32.2°/ 23.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

టమాట కిలో రూ.22

- నో సేల్ కింద 102 టన్నులు
- రైతులకు రూ. 12 లక్షల నష్టం



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 3,500 టన్నుల సరుకు అమ్మకానికి రాగా వాటిని బహిరంగ వేలం వేశారు. కిలో గరిష్ట ధర రూ.22, కనిష్టం రూ.6, సరాసరి రూ.11 ప్రకారం అమ్మకాలు జరిగినట్లు తెలిపారు. శనివారం కూడా నోసేల్ కింద 102 టన్నులు ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో సరాసరి లెక్క వేసుకున్నా రూ.12 లక్షల వరకు రైతులకు నష్టం జరిగింది.

అప్పు చెల్లించలేదని వ్యక్తి హత్య

తాడిపత్రి అర్బన్: అప్పు చెల్లించలేదని వ్యక్తిని హత్య చేసిన ఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జ్ అర్బన్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన మేరకు.. పట్టణంలోని జయనగర్ కాలనీకి చెందిన రాజేంద్ర (40) డ్రైవర్. కొన్ని రోజుల క్రితం ఈయన భార్య ఉమాదేవి స్థానిక జయగనగర్ కాలనీలో ఉంటున్న తిప్పారెడ్డి భార్య నాగలక్ష్మీ వద్ద రూ.38 వేలు అప్పుగా తీసుకుంది. అప్పు చెల్లించాలంటూ తిప్పారెడ్డి, నాగలక్ష్మీ ఒత్తిడి చేస్తుండడంతో ఈ విషయాన్ని ఉమాదేవి తన భర్తకు చెప్పింది. దీంతో రాజేంద్ర శనివారం తిప్పారెడ్డి ఇంటి వద్దకు వెళ్లాడు. కొన్ని రోజుల తరువాత అప్పు చెల్లిస్తామని చెప్పాడు. ఈ క్రమంలోనే తిప్పారెడ్డి, అతని భార్య నాగలక్ష్మీ, వారి తమ్ముడి కుమారులకు, రాజేంద్రకు మధ్య వాగ్వాదం చోటు చేసు కుంది. అంతా కలిసి రాజేంద్రపై దాడికి పాల్పడ్డారు. కొంతసే పటికి అక్కడి నుంచి బయలుదేరిన రాజేంద్ర కొద్దిదూరంలోనే కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమాదేవి పరుగున అక్కడికి వచ్చి బోరున విలపించింది. అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిప్పారెడ్డి, భార్య నాగలక్ష్మీ, అతని సోదరుల కుమారులపై కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు.

పంచాయతీరాజ్ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ రేపు

- ప్రత్యేకాధికారిగా ఈఎన్‌సీ బాలు నాయక్



అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సోమవారం బదిలీలపై కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అనంతపురం కేంద్రంగా జోన్-4 పరిధిలోని రాయలసీమ జిల్లాల ఇంజినీరింగ్ సహా ఇతర అన్ని రకాల కేడర్ల ఉద్యోగులకు కౌన్సెలింగ్ ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, టెక్నికల్ ఆఫీసర్లు, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ ఇస్తారు. కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిగా పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.బాలు నాయక్‌ను ప్రభుత్వం నియమించింది.

రేపు అర్జీల స్వీకరణ ఉండదు

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో ఈ నెల 26న జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రజలు గమనించాలన్నారు. వ్యయ ప్రయాసల కోర్చి అర్జీలతో కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

నిఘా కట్టుదిట్టం చేయాలి



సర్వజనాస్పత్రిలో నిఘా కట్టుదిట్టం చేయాలి. రాత్రి వేళ విధులు ముగించుకుని వెళ్లే సమయంలో హాస్టల్‌వైపు లైట్లు ఉండవు. అదేవిధంగా ఆస్పత్రిలో చాలా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. రౌండ్ ద క్లాక్ ఆస్పత్రి గేట్లు తెరిచే ఉంటాయి. ఆ సమయంలో లోపలికి వచ్చే వ్యక్తులు వైద్యం కోసం వస్తున్నారా లేక మరెందుకు వస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రవేశమార్గంలోనే సెక్యూరిటీ నిఘా కట్టుదిట్టం చేయాలి. – స్వప్న, పీజీ వైద్య విద్యార్థి, చిన్నపిల్లల విభాగం



రక్షణ చట్టం తీసుకురావాలి



జీజీహెచ్‌లో వైద్యులకు రక్షణ కరువైంది. రాత్రి వేళ విధులు నిర్వర్తించే సమయంలో కొన్ని వార్డులకు వెళ్లే మార్గాల్లో లైటింగ్ ఉండదు. కోల్‌కతాలో జరిగిన అఘాయిత్యాలు ఎక్కడా జరగకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి. వైద్యులకు రక్షణ చట్టం తీసుకురావాలి. ముఖ్యంగా స్త్రీల పట్ల పురుషుల దృక్పథంలో మార్పు రావాలి. అప్పుడే అత్యాచారాలకు అడ్డుకట్ట పడుతుంది.

– డాక్టర్ ప్రసూన, జనవిజ్ఞాన వేదిక

ముంచుతున్న ప్లాస్టిక్

ప్లాస్టిక్ వ్యర్థాలతో జిల్లాలోని పట్టణాలు కంపుకొడుతున్నాయి. చెత్తకుప్పలు మొదలు డ్రైనేజీ కాలువల వరకూ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిబంధనలకు పాతర వేయడంతో ప్రమాద తీవ్రత ఏటికేటికీ పెరుగుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం స్పందించడం లేదు. ఓవైపు ప్లాస్టిక్ కవర్ల వాడకం పెరుగుతుండటం, మరోవైపు వాటిని రీసైక్లింగ్ చేసే యూనిట్లు అతి తక్కువగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది.

- ప్లాస్టిక్ నిబంధనలకు తూట్లు
- మార్కెట్‌లో విచ్చలవిడిగా కవర్లు
- ఎక్కడ చూసినా 20 మైక్రాన్ల కవర్లే
- మున్సిపాలిటీల చెత్తలో సగం ప్లాస్టిక్ వ్యర్థాలే
- పొంచి ఉన్న ప్రమాదకర జబ్బులు
- క్యాన్సర్‌తో పాటు స్త్రీలలో సంతానోత్పత్తి సమస్యలు





ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన అనంతపురం నడిమివంక



అనంతపురం నగరంలోని ఓ కాలువలో ఇలా...

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లాలోని 9 మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ వాడకం తీవ్రంగా ఉన్నట్టు తేలింది. ఒక్క అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే నెలకు 15 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్టు లెక్కగట్టారు. తొలుత 40 మైక్రాన్ల మందమున్న ప్లాస్టిక్ కవర్లు మాత్రమే వాడాలని నిబంధన ఉండేది. అయితే, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2016లో కొత్త నిబంధనలు విధించింది. 50 మైక్రాన్ కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆస్పత్రుల్లో విడుదలవుతున్న బయో వ్యర్థాలపై కూడా ఆంక్షలు విధించింది. ఎక్కడైతే బయో వ్యర్థాలు విడుదలవుతున్నాయో వాటి నిర్వీర్యంలో కూడా ఆ సంస్థలే ప్రధానంగా బాధ్యత వహించాలని సూచించింది. కానీ ఈ నిబంధనలు ఉమ్మడి జిల్లాలో అమలు కావడం లేదు. ఇటీవలి కాలంలో 20 మైక్రాన్ల మందం మాత్రమే ఉన్న ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా అందుబాటులోకి వచ్చాయి. బడ్డీకొట్లు, చికెన్ షాపులు తదితర చోట్ల 20 మైక్రాన్ల ప్లాస్టిక్ కవర్లే వాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు ఉత్పత్తి చేసినా, వినియోగించినా రూ.25 వేల జరిమానా విధించాలని ఉన్నా పట్టించుకునే నాథుడే లేరు.

నియంత్రణ అధికారులు ఏరీ?

నాసిరకం ప్లాస్టిక్ బ్యాగుల నియంత్రణ లీగల్ మెట్రాలజీ పరిధిలోకి వస్తుంది. కానీ వీటిని ఆ శాఖ అధికారులు నియంత్రిస్తున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. పెద్ద పెద్ద మాల్స్‌లో కూడా 20 మైక్రాన్‌ల బ్యాగులు వాడుతున్నా పట్టించుకోవడం లేదు. కొన్ని టీస్టాళ్లలో వేడి వేడి టీని కూడా ఇలాంటి కవర్లలోనే పార్సిల్ చేసి ఇస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నా ఎవరూ అటువైపు చూడటం లేదు.

ఏది సురక్షితం.. ఏది హానికరం?

ప్లాస్టిక్ తయారీ వస్తువులకు నంబర్లు ఉంటాయి. వీటిలో ఒక్కో నంబరు ఒక్కో క్వాలిటీని సూచిస్తుంది.

- 1, 2, 4, 5 నంబర్లు సూచించే ప్లాస్టిక్‌ను వాడుకోవచ్చు.
- 3, 6, 7 నంబర్లు ఉన్న ప్లాస్టిక్‌ను దూరంగా ఉంచడం మంచిది.
- ప్లాస్టిక్ వస్తువుల మీద ఈ నంబర్లు సూచించే వాటిని తీసుకోవచ్చు.
- 30 లేదా 20 మైక్రాన్‌ల కంటే తక్కువ దళసరి ఉన్న ప్లాస్టిక్ బ్యాగులు నేరుగా హాని తలపెడతాయి.
- పాలీవినైల్ లేదా పీవీసీ అనే ప్లాస్టిక్‌ను వాడకూడదు.
- మైక్రో ఓవెన్లలో ప్లాస్టిక్‌లో ఆహార పదార్థాలను ఉంచి వేడిచేసి తినకూడదు.
- చల్లటి నీరైనా, వేడి పానీయాలైనా పాలీకార్బొనేట్ ప్లాస్టిక్ బాటిళ్లలోనే నింపి తాగేందుకు వాడుకోవాలి.
- 'పాథలేట్-ఫ్రీ' లేదా 'బీపీఏ-ఫ్రీ' అనే లేబుళ్లు ఉన్న వస్తువులనే వాడుకోవాలి.
- చిన్నపిల్లల పాల బాటిళ్లు, నీళ్ల బాటిళ్లలో 'బీపీఏ-ఫ్రీ' అని సూచించే వాటినే వాడాలి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ మున్సిపాలిటీల్లో నెలకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా

మున్సిపాలిటీ/ కార్పొరేషన్	ప్లాస్టిక్ వ్యర్థాలు (టన్నుల్లో)
అనంతపురం	15.7
గుంతకల్లు	8.2
గుత్తి	1.02
హిందూపురం	8.43
తాడిపత్రి	0.8
ధర్మవరం	0.96
రాయదుర్గం	0.84
కదిరి	0.96
పెనుకొండ	0.65
మొత్తం	37.56

ప్లాస్టిక్ వ్యర్థాలతో భయంకర జబ్బులు

- ప్లాస్టిక్ బ్యాగుల్లో నిల్వ ఉంచి ఆ పదార్థాలను తినడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ.
- మహిళల్లో పునరుత్పత్తి ప్రక్రియకు హాని చేసే అవకాశాలున్నాయి.
- వ్యాధి నిరోధకత భారీగా తగ్గే అవకాశముంది.
- జీర్ణకోశ వ్యాధులు ఎక్కువగా వస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు.
- లైంగిక సంబంధమైన హార్మోన్లు క్రమంగా తగ్గే అవకాశాలుంటాయి.
- వ్యాధికారక పదార్థమైన పాథలేట్స్ శరీరంలోకి చేరి పలు రకాల జబ్బులను చేస్తాయి.
- గుండె జబ్బులు రావడానికి కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు కారకాలుగా ఉన్నాయి.

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం



ప్లాస్టిక్ నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించాం. నిషేధిక ప్లాస్టిక్‌ను ఎవరూ వినియోగించరాదు. ప్లాస్టిక్ నియంత్రణకు తరచూ డ్రైవ్‌లు చేపడుతున్నాం. ప్రజలు సైతం నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకూడదు. పర్యావరణంతో పాటు మనుషులకు సమస్యగా మారుతుంది. సామాజిక స్పృహతో ప్లాస్టిక్‌ను వాడకుండా ఉండాలి.

– పీవీవీఎస్ మూర్తి, మునిసిపల్ ఆర్‌డీ

ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం



నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం. మనం తీసుకునే ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లడం, అందులోని పదార్థాలను తీసుకోవడం వల్ల ప్రమాదకర మూత్రాశయ కేన్సర్ బారిన పడడం, ప్లాస్టిక్ రేణువులు మెదడులోకి వెళ్లి సమస్యలు వస్తాయి. సాధ్యమైనంత వరకూ నిషేధిత ప్లాస్టిక్‌కు దూరంగా ఉండడం ఆరోగ్యకరం.

– డాక్టర్ షంషాద్‌బేగం, గైనిక్ హెచ్‌ఓడీ, జీజీహెచ్

విధుల్లోకి జూడాలు, హౌస్‌సర్జన్లు

అనంతపురం మెడికల్: జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లు విధుల్లో చేరారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె విరమించడంతో శనివారం ఉదయం 8 గంటల నుంచి యథావిధిగా విధుల్లో పాల్గొన్నారు. కోల్‌కతాలో పీజీ విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా 351 మంది పీజీలు, 132 మంది హౌస్‌సర్జన్లు సమ్మెలోకి వెళ్లిన విషయం విదితమే. సమ్మె విరమించడంతో శనివారం ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో పీజీ వైద్యులు, హౌస్‌సర్జన్లు చేరారు. వీరు విధుల్లోకి రావడంతో స్టాఫ్‌నర్సులపై పని ఒత్తిడి తగ్గింది.

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి హెచ్చరించారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు తమ ఆస్పత్రుల్లో గర్భిణులకు తప్పనిసరిగా నమోదు కార్డు అందజేయాలన్నారు. ప్రధానంగా ఆడ పిల్ల ప్రాముఖ్యతను పెళ్లీడుకొచ్చిన యువతకు తెలియజేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న వైద్యులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే సెంటర్‌ను సీజ్ చేయడంతో పాటు కోర్టులో కేసు వేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ సుజాత, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ నారాయణ స్వామి, డాక్టర్ అనుపమ జేమ్స్, పీపీ హరినాథ్, రెడ్స్ సంస్థ భానూజా, డెమో త్యాగరాజు, గంగాధర్, సుబ్రమణ్యం, వేణు, వెంకటేష్, కిరణ్, శ్రీకాంత్, లీగల్ అడ్వైజర్ ఆశారాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 1,033 మెట్రిక్ టన్నుల యూరియా



అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు జిల్లాకు అవసరమైన ఎరువులు సరఫరా అవుతున్నట్లు ఏడీఏ ఎం.రవి తెలిపారు. శనివారం ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా వచ్చిన 1,033 మెట్రిక్ టన్నుల యూరియాను ఆయన పరిశీలించారు. ఇఫ్కో కంపెనీ నుంచి వచ్చిన యూరియాను కలెక్టర్, జేసీ, జేడీఏ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ సంస్థకు 500 మెట్రిక్ టన్నులు, ఇండెంట్ మేరకు ప్రైవేట్ డీలర్లకు 533 మెట్రిక్ టన్నులు సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు.

టమాట రైతులను ఆదుకోవాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, చిత్రంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: 'జిల్లాలో టమాట రైతులను ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలి. పంటసాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించడంతో పాటు పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేక టమాట పంటను రైతులు రోడ్ల పక్కన పడేసే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. టమాట రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని చెప్పారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందించాలన్నారు. వర్షాల కారణంగా పంట దెబ్బతింటే నష్ట నివారణ కింద ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ పథకం కింద ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు వాతావరణ బీమా వర్తింపజేయాలన్నారు. మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు బజార్లకు టమాట పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో ఈ-పంట నమోదు, కౌలు రైతులకు కార్డుల జారీ ప్రక్రియ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు, మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై దృష్టి పెట్టాలి

భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యల విషయంలో చట్టపరమైన అంశాలకు లోబడి ఉండాలన్నారు. లేకపోతే సమస్య జఠిలంగా మారే అవకాశం ఉందన్నారు. భూ సమస్యలు ఎన్ని రకాలుగా ఉంటాయి, చట్టపరంగా ఏ విధంగా పరిష్కరించాలి అనే విషయాలను రిటైర్డ్ తహసీల్దారు విజయ రాఘవరావు వివరించారు. డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓలు రాణిసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, కలెక్టరేట్ ఏఓ మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

రాయదుర్గం: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు చేపడతామని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ హెచ్చరించారు. శనివారం కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుస్మిత, మైనింగ్ డీడీ నాగయ్యతో కలసి మండలంలోని జుంజురంపల్లి వేదావతి హగరి నదిలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక కోసం రసీదు పొందిన వాహనాలు మాత్రమే రీచ్‌లోకి అనుమతించాలన్నారు. టన్నుకు రూ.195 వసూలు చేయాలన్నారు. ఎన్ని టన్నులు నిల్వ ఉందనే విషయం రోజూ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

రామలింగేశ్వరుని సేవలో హైకోర్టు జడ్జి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ప్రాచీన దేవాలయాలను హైకోర్టు జడ్జి జస్టిస్ వి.సుజాత శనివారం సందర్శించారు. మొదట పెన్నా నది తీరాన వెలసిన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని కాశీవిశ్వేశ్వరున్ని జలంతో అభిషేకించారు. ఆలయంలోని శిల్పకళను తిలకించారు. ఆలయ ప్రాశస్త్యాన్ని అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చింతల వెంకటరమణస్వామి ఆలయానికి చేరుకుని అంతరాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. పక్కనే ఉన్న ఆనందవల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. గర్భాలయం వెలుపల ఉన్న గోడలపై రామాయణంలోని ఘట్టాలను వివరిస్తూ చెక్కిన శిల్పాల గురించి అర్చకులు మురళీబట్టార్ వివరించారు. అనంతరం సంజీవనగర్ మొదటి రోడ్డులోని వేదగాయత్రీదేవి ఆలయంలో అమ్మవారిని, అమర లింగేశ్వరస్వామిని, శివసాయిబాబా ఆలయంలో బాబాను దర్శించుకున్నారు. హైకోర్టు జడ్జి వెంట జిల్లా ఫస్ట్ అడిషనల్ జడ్జి సత్యవతి, తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

హైకోర్టు జడ్జిని సన్మానించిన తాడిపత్రి బార్ అసోసియేషన్

జస్టిస్ సుజాతను స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో తాడిపత్రి బార్ అసోసియేషన్ న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామానుజన్‌రెడ్డి, న్యాయవాదులు ఎన్వీ భాస్కర్‌రెడ్డి, చక్రపాణి, సతీష్, మునయ్య, రమణారెడ్డి, ప్రభుకుమార్, సాహుల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.



బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న హైకోర్టు జడ్జి జస్టిస్ వి.సుజాత



శనీశ్వర దర్శనానికి తరలివచ్చిన జనం

● శ్రావణం..భక్త సాగరం

పావగడ: శ్రావణ మాసంలో వచ్చిన మూడో శనివారం స్థానిక శనీశ్వరాలయం భక్తులతో పోటెత్తింది. శ్రావణ బహుళ పంచమిని పురస్కరించుకుని అర్చకులు గర్భగుడిలోని మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణశాస్త్రి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కలశ స్థాపన, గణపతి, నవగ్రహ పూజలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, తైలాభిషేకం, కుంకుమార్చన, ప్రాకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక భవనంలో ఏర్పాటు చేసిన సామూహిక నవ గ్రహాల తైలాభిషేకంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. అనంతరం అమ్మవారు శీతలాంభదేవికి సహస్ర కుంకుమార్చన చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ సమితి అధ్యక్షుడు ఆనంద రావు, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి సుబ్బనరసింహ తదితరులు ఏర్పాట్లు చేశారు. అన్నదానంతో పాటు వసతి సౌకర్యం కల్పించారు. సీఐ సురేష్ నేతృత్వంలో ఆలయం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



అలంకరణలో శనీశ్వరస్వామి

క్లుప్తంగా

సర్వజనాస్పత్రిలో సెక్యూరిటీ ఆడిట్



సమస్యలను సీఐ శ్రీకాంత్‌కు వివరిస్తున్న ఆప్ జూడా అధ్యక్షుడు డాక్టర్ హరికిరణ్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పీజీ వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్స్, స్టాఫ్‌నర్సుల భద్రతకు సంబంధించి శనివారం సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత తదితరులతో కలసి టూటౌన సీఐ శ్రీకాంత్ ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, ఏఎంసీ, మెడిసిన్, సర్జరీ, ఈఎన్‌టీ, చెస్ట్, ఐడీ, గైనిక్, లేబర్, మానసిక వైద్య విభాగం, పీడియాట్రిక్ తదితర వార్డులు, పీజీ హాస్టల్‌లో కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను సీఐ శ్రీకాంత్‌కు ఆప్ జూడా అధ్యక్షుడు డాక్టర్ హరికిరణ్ వివరించారు. కార్యక్రమంలో ఔట్‌పోస్టు ఏఎస్ఐ త్రిలోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎకాలజీ సెంటర్‌లో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం అగ్రికల్చర్: నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ అంశాలపై 60 రోజుల పాటు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్స్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీసు, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ తదితర కోర్సులపై నాణ్యమైన శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 20 నుంచి 35 సంవత్సరాల వయస్సుండి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ కోర్సుల్లో పాస్ లేదా ఫెయిల్ అయినా యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజనం వసతి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్‌తో పాటు 100 శాతం ఉపాధి అవకాశాలు లభించేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, ఆర్డీటీ స్టేడియం ఎదురుగా, ఉప్పరపల్లి లేదా 73969 50345, 77807 52418 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



మృతుడు చంద్రశేఖర్

గుత్తి: పట్టణంలోని చెంబుల బావి వీధికి చెందిన ఆటో డ్రైవర్ చంద్రశేఖర్ (53) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో పైకప్పు కొక్కేనికి ఉరి వేసుకుని తనువు చాలించాడు. అనారోగ్య కారణాలతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ చెప్పారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పూర్తి స్థాయి నిఘా ఏర్పాటు చేయాలి



“ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పూర్తి స్థాయి నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రి ఆవరణలోనే చాలా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేవు. ఫలితంగా రాత్రి వేళల్లో విధులకు హాజరు కావాలన్నా... హాస్టళ్లకు వెళ్లే మహిళా పీజీలు భయాందోళనకు గురవుతున్నారు. ఎవరో ఒకరు తోడు లేనిదే వెళ్లలేకపోతున్నారు. లైట్లు కూడా ఏర్పాటు చేయాలి.

– ఇతిహాస్, పీజీ మొదటి సంవత్సరం



సౌకర్యాలు కల్పించాలి



ప్రభుత్వ సర్వజనాస్పత్రి అసౌకర్యాల మయంగా మారింది. కనీస మౌలిక వసతులు లేక వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళా వైద్యులకు వాష్‌రూంలు లేవు. క్యాంటీన్ ఉంటే కాస్త రిలీఫ్‌గా ఉంటుంది. వసతులు బాగుంటే వైద్యులు మరింత సమయం అక్కడే ఉంటూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించగలుగుతారు. ప్రస్తుతం ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులను అదుపు చేయడానికి సెక్యూరిటీ చాలడం లేదు. వందల సంఖ్యలో రోగి సహాయకులు వస్తుంటే వారి మధ్యలో విధులు నిర్వర్తించడం చాలా కష్టంగా ఉంటోంది.

– డాక్టర్ యండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణులు, అనంతపురం

వయసు తగ్గించి.. విధుల్లోనే నక్కి

- తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో బురిడీ
- తాడిపత్రి ప్రాజెక్టులో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తల అత్యాశ
- ఫిర్యాదులపై విచారణకు ఆదేశించిన కలెక్టర్



తాడిపత్రిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

తాడిపత్రి అర్బన్: అత్యాశకు పోయిన అంగన్‌వాడీ కార్యకర్తలు కొందరు తమ వయసును తగ్గించుకుని మరికొన్నేళ్లు కొలువుల్లో ఉండేందుకు కుయుక్తులు పన్నారు. వయసు మీరినా ఇంకా విధుల్లో ఉంటున్న వారిపై పలువురి నుంచి కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే విచారణ ముందుకు సాగకుండా యూనియన్ నాయకురాలు ఒకరు శతవిధాలా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మూడు దశాబ్దాల కిందట తక్కువ విద్యార్హతతోనే అంగన్‌వాడీ కార్యకర్తలుగా నియమితులయ్యారు. అప్పట్లో పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి రూ.550, ఫెయిలైన వారికి రూ.500 చొప్పున గౌరవ వేతనం అందేది. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తకు గౌరవ వేతనం రూ.11,500 వస్తోంది. నియామక సమయంలో ఇచ్చిన పత్రాల ఆధారంగా కొన్నేళ్ల క్రితమే వారు ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఉన్న చోటనే ఉద్యోగం.. ఓపికున్నంత వరకూ చేసుకుందామనుకున్నారో ఏమో తెలియదు కానీ ఇటీవల సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్ టెన్త్ పరీక్షలు రాసే సమయంలో పలువురు తమ వయసును 15 నుంచి 20 ఏళ్ల వరకు తగ్గించుకున్నట్లు తెలిసింది. ఆ సర్టిఫికెట్లను ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు సమర్పించి.. దాని ఆధారంగా మరి కొన్నేళ్లు సర్వీసులో ఉండేందుకు మార్గం సుగమం చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దాదాపు పది మంది ఇలా విధుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాల్లో ఖాళీ అయ్యే పోస్టుల కోసం ఎదురు చూస్తున్న వారు ఇలాంటి వారి వయసును ధ్రువపరిచే ఆధారాలతో రాతపూర్వకంగా కలెక్టర్‌కు ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’లో ఫిర్యాదులు చేశారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..

అంగన్‌వాడీల బాగోతంపై సాక్షాత్తు కలెక్టర్ వినోద్‌కుమార్ విచారణకు ఆదేశించారు. 20 రోజులవుతున్నా ఐసీడీఎస్‌లోని కొందరు ఉన్నతాధికారులు కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగంలో చేరేనాటికి అంగన్‌వాడీ టీచర్లు సమర్పించిన ధ్రువీకరణపత్రాలు, తరువాత అందజేసినవి, ఇతరత్ర పత్రాలను పరిశీలించి.. అక్రమంగా విధుల్లో కొనసాగుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

అక్రమార్కులకు అండగా యూనియన్ నేత

తప్పుడు ధ్రువీకరణపత్రాలతో విధులు నిర్వర్తిస్తున్న కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలను కాపాడేందుకు యూనియన్ నేత ఒకరు రంగప్రవేశం చేసినట్లు తెలిసింది. విచారణ వేగవంతం కాకుండా సీడీపీఓతో మంతనాలు సాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

గతంలో కూడా ఓ కార్యకర్తపై వేటు

గతంలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త కూడా ఇలానే ఓపెన్ టెన్త్ సర్టిఫికెట్‌లోని వయసు ఆధారంగా ఇంకా విధుల్లోనే కొనసాగుతుండేది. అయితే విషయం సీడీపీఓ దృష్టికి వెళ్లడంతో విచారణ చేపట్టి సదరు అంగన్‌వాడీ కార్యకర్తపై వేటు వేశారు. ప్రస్తుతం కలెక్టర్ విచారణకు ఆదేశించినా సదరు అంగన్‌వాడీలపై చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

రెండు రోజుల గడువిచ్చాం

రిటైర్డు వయసు దాటినా తప్పుడు సర్టిఫికెట్ల కారణంగా కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో కొనసాగుతున్నారన్న విషయంపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలోనే ముగ్గురిని పిలిచి విచారణ చేశాం. అయితే వారు మా వద్ద వయసుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేవని చెబుతున్నారు. ఉన్న సర్టిఫికెట్లకు చెదలు పట్టాయని తెలిపారు. అయినా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. మరింత లోతుగా విచారణ చేసి తప్పు అని తేలితే వెంటనే విధుల నుంచి తొలగిస్తాం.

– సాజిదాబేగం, సీడీపీఓ. ఐసీడీఎస్, తాడిపత్రి

దుండగులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సాలాబాయి

గుంతకల్లుటౌన్: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార దుండగులను కఠినంగా శిక్షించాలని గుంతకల్లులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సాలాబాయి డిమాండ్ చేశారు. హత్యాచార ఘటనకు నిరసనగా కళాశాల విద్యార్థులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మహిళలు, బాలికల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేయాలని నినదించారు. కార్యక్రమంలో ఆర్డీటీ అధికారులు రామకృష్ణమ్మ, నాగరాజు, ఈశ్వర్, ఎటీఎల్ శ్రీవరకుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం



పంటను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

కళ్యాణదుర్గం రూరల్: అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ హామీ ఇచ్చారు. శనివారం గోళ్ల గ్రామంలో ఆయన పర్యటించారు. రైతు చంద్రశేఖర్ ఐదు ఎకరాల్లో సాగు చేసిన టమాట, కర్బూజ పంటలు వర్షాలకు దెబ్బతినడంతో వ్యవసాయ అధికారులతో కలిసి ఇన్‌చార్జ్ కలెక్టర్ పరిశీలించారు. నిబంధనల మేరకు పరిహారం అందిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాణీ సుస్మిత, ఏడీఏ ఎల్లప్ప, తహసీల్దార్ భాస్కర్, ఏఓ జగదీష్, రైతులు పాల్గొన్నారు.

అంతటా.. అంజన్న నామస్మరణ

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. ఆంజనేయస్వామి నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. స్వామి సేవలో భక్తులు తన్మయత్వం పొందారు. వేకువజామునే అభిషేకాలు నిర్వహించిన అర్చకులు స్వామివారిని వజ్రకవచ అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెరవళి పారా రామన్న కుమారుల ఆధ్వర్యంలో భక్తులకు చక్కెర పొంగలి ప్రసాదం అందజేశారు. ఆలయ తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న బెల్దోణ సత్రంలో భక్తులకు నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను గజ వాహనంపై కొలువుదీర్చి ఈఓ భద్రాజీ, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివార్లను ఊరేగిస్తూ ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు.



లక్ష తులసి అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి



కసాపురంలో శ్రీసీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నేమకల్లులో కిక్కిరిసిన భక్తులు

బొమ్మనహాళ్: శ్రావణమాస మూడో శనివారం నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచే కాకుండా హనుమాన్ దర్శన్ బస్సుల ద్వారా, ప్రత్యేక వాహనాలు, ప్రైవేట్ వాహనాల్లో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ స్వామి, సంతోషకుమార్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పవిత్ర గంగా జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక వెండి కవచధారణ, బంగారు కిరీటధారణ, వెండి తమలపాకు అలంకరణ, ఆకు పూజలు చేశారు. లక్ష తులసీమాల అలంకరణలో అంజన్న భక్తులకు దర్శనమిచ్చారు. బళ్లారికి చెందిన జెల్లె హనుమంతప్ప, మీనాక్షమ్మ భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం స్వామివారి ఆలయంలో హనుమాన్ భజనమండలి, భక్తమండలి సభ్యులు పల్లకీసేవ, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర నీటి కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలి

గుంతకల్లు: తుంగభద్ర నీటి కేటాయింపులపై అధికారులు స్పష్టత ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. శనివారం గుంతకల్లులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగభద్ర డ్యాం ఎత్తును 1,633 నుంచి 1,634 అడుగుల ఎత్తుకు పెంచిన విషయాన్ని గోప్యంగా ఉంచడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. డ్యాం సామర్థ్యం పెరగడం వల్ల నీటి నిల్వలూ పెరుగుతాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణ నీటి కేటాయింపులు వెల్లడించాలని కోరారు. గతంలో రైల్వే సహాయ మంత్రిగా ఉన్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కర్నూలు జిల్లాలో రైలు వ్యాగన్ కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు రైల్వే బోర్డు నుంచి అనుమతులు తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రసుత్త కూటమి పాలకులు ఈ ఫ్యాక్టరీని గుంతకల్లులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ అధ్యక్షుడు గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాముురాయల్, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు జగదీష్

అర్హులందరికీ బిందుసేద్యం పరికరాలు

వజ్రకరూరు: జిల్లాలో అర్హులైన రైతులందరికీ బిందు సేద్యం పరికరాలు మంజూరు చేయనున్నట్లు ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. శనివారం గంజికుంటలో ఆయన పర్యటించారు. వేణుగోపాల్ రైతు పొలంలో ఈ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. జిల్లాకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 37,500 హెక్టార్లు అత్యధిక లక్ష్యం కేటాయించినట్లు వెల్లడించారు. 28 కంపెనీలకు బిందు సేద్యం పరికరాల సరఫరాకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఏపీడీ ఆధ్వర్యంలో 11 మంది రైతులకు రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బిందు సేద్యం పరికరాలు, మంజూరు తదితర వివరాలపై చర్చించారు. కార్యక్రమంలో గంజికుంట సర్పంచ్ జయేంద్రరెడ్డి, వీహెచ్ఏ కృపా, జైన్ కంపెనీ డీలర్ రామసుబ్బయ్య, కంపెనీ ప్రతినిధి శ్రీధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



గంజికుంటలో ఈ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ ఏపీడీ


స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దు



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం అర్బన్: వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల విషయంలో కూటమి ప్రభుత్వం మాట తప్పి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిందని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును టీడీపీ వ్యతిరేకించడమే కాకుండా హైకోర్టులో పిటిషన్లు వేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్ల ప్రక్రియ కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. మొదటి దశలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల పేరుతో క్రమంగా ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నివాస గృహాలకు మీటర్లతో ప్రీపెయిడ్ పద్ధతి, విద్యుత్ వాడే సమయాన్ని బట్టి అదనపు చార్జీలు, మీటర్ల ఖర్చు, తదితర రూపాల్లో వినియోగదారులపై భారం పడుతుందన్నారు.

పక్కాగా పంటకోత ప్రయోగాలు



మాట్లాడుతున్న డీఏఓ ఉమా మహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: పంట కోత ప్రయోగాలను పక్కాగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శనివారం సీపీఓ కార్యాలయంలో ఏడీఏలు, ఏఓలు, ఏఎస్ఓలు, ఉద్యాన శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల దిగుబడిని ప్రమాణాలకు అనుగుణంగా ప్రయోగాలు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో గడువులోపు పంట కోత ప్రయోగాలు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఈ–పంట నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్‌కుమార్, జిల్లా ఉద్యాన అధికారి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

యాడికి: చందన గ్రామ సమీపంలోని పేకాట స్థావరంపై సీఐ ఈరన్న తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.7,300 నగదుతో పాటు నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

‘శ్వాసతో యుద్ధం’ కవితా సంపుటికి జాతీయ అవార్డు



మధురశ్రీ

అనంతపురం కల్చరల్: అనంతపురానికి చెందిన సీనియర్ కవి మధురశ్రీ రాసిన ‘శ్వాసతో యుద్ధం’ కవితా సంపుటిని జాతీయ సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణ తెలిపారు. గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, నవ్యాంధ్ర రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు జాతీయ భాషా సాహిత్య, కళా, సేవా రంగాల్లో అందిస్తున్న జాతీయ పురస్కారాల వివరాలను శనివారం వెల్లడించారు. అందులో భాగంగా మధురశ్రీ ఇటీవల ఆవిష్కరించిన పుస్తకాన్ని ఎంపిక చేశామని, ఈ నెల 29న విజయవాడలో పురస్కారం అందించనున్నామని తెలిపారు. చక్కటి కవితా వస్తువులతో అద్భుతమైన కవిత్వాన్ని ఆవిష్కరించిన మధురశ్రీ జాతీయ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి, అనంత జిరసం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

పాలిటెక్నిక్ విద్యార్థి బలవన్మరణం



మృతుడు రాజు

రాయదుర్గం(డి.హీరేహాళ్): డి.హీరేహాళ్ మండలం దొడగట్టకు చెందిన రాజు (18) అనే పాలిటెక్నిక్ విద్యార్థి శనివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అనంతపురంలో ఐటీఐ పరీక్ష రాసేందు కోసం స్వగ్రామం వచ్చాడు. అంతదూరం వెళ్లి పాలిటెక్నిక్ చదవడం తనవల్ల కాదని, ఐటీఐ పరీక్షలో నెగ్గి ఇక్కడే ఉంటానని తరచూ తల్లిదండ్రులతో అంటుండేవాడు. ఆ పరీక్షల్లో కూడా పాసైతానో లేదోనన్న అనుమానంతో రెండు రోజులుగా కుంగిపోయాడు. మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం చీరతో ఉరివేసుకున్నాడు. గమనించిన తండ్రి చుట్టుపక్కల వారి సాయంతో హుటాహుటిన కణేకల్లు ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స మొదలుపెట్టేలోగానే రాజు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మనోవేదనతో మరొకరు...

కణేకల్లు: సొల్లాపురం గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (50) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గతేడాది తన భార్య చిట్టెమ్మను వన్నూరుస్వామి దారుణంగా కొట్టి హత్య చేశాడు. అప్పటి నుంచి కొడుకు, కూతురు వన్నూరుస్వామితో మాట్లాడటం మానేశారు. పిల్లలతో పాటు బంధువులెవరూ పలకరించకపోవడంతో మనోవేదనకు గురైన వన్నూరుస్వామి జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంటి చౌకట్టుకు ఉరి వేసుకున్నాడు.

పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి

అనంతపురం అర్బన్: పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల శ్రేయస్సుకు వాటి యాజమాన్యాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి పరిశ్రమలోనూ సేఫ్టీ ఆడిట్ నిర్వహించి భద్రత లోటుపాట్లను సరిచేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. పరిశ్రమల్లో భద్రత, వసతుల కల్పనపై జేసీ శనివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఎస్పీ పి.జగదీష్, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. కార్మికుల భద్రతకు పరిశ్రమలు అమలు చేస్తున్న విధనాలపై సేఫ్టీ ఆడిట్ నిర్వహించి లోటుపాట్లు గుర్తించి సరిదిద్దాలని ఆదేశించారు. అన్ని చోట్లా మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ప్రమాదాలపై కార్మికులు, పరిసరాల్లో నివాసముంటున్న వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి పరిశ్రమలోనూ సేఫ్టీ ప్రోటోకాల్ పాటిస్తూ నైపుణ్యం కలిగిన ఒక ఇన్‌చార్జ్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజారావు, ఆర్డీఓలు రాణీసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం సోని, పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, చిత్రంలో ఎస్పీ జగదీష్



వైద్య సిబ్బందిపై దాడులు దుర్మార్గం

రోగుల ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో సేవలందించే వైద్య సిబ్బందిపై దాడులు చేయడం దుర్మార్గం. దాడుల నుంచి వైద్యులకు భద్రత కల్పించాలి. నేను ఇంట్లో కుటుంబ సభ్యులతో ఎలా ఉంటానో.. రోగులతో కూడా అలాగే ఉంటాను. రోగులను కుటుంబ సభ్యులు లాగా భావించి వైద్యం చేస్తాను. కోల్‌కతా ఘటన అనంతరం విధులకు వెళ్లాలంటే భయం వేస్తోంది. నా పిల్లలను బాగా చదివించి డాక్టర్స్ చేయాలని అనుకున్నాను.. ప్రస్తుతం ఈ దాడులు చూస్తుంటే వారిని ఎంబీబీఎస్ చదివించాలంటే భయమేస్తోంది. ఈ తరహా దాడులను అరికట్టడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేయాలి.

– శ్రావణి, వైద్యాధికారి, రాప్తాడు





ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి

ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కతా ఘటన అమానుషం. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు చేయాలి. మహిళా డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది రాత్రి పూట విధులు నిర్వర్తించే సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా ఆస్పత్రి ప్రాంగణంలోకి మద్యం మత్తులో ఉండే వారిని, ఇతరులను అనుమతించకుండా సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి.

– శివకృష్ణ, వైద్యాధికారి, రాప్తాడు

క్లుప్తంగా

బస్టాండ్ నిరుపయోగమే..!



ఆత్మకూరు బస్టాండ్ ఎదురుగా గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

ఆత్మకూరు: మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాలుగా ఆర్టీసీ బస్టాండ్ నిరుయోగంగా మారింది. బస్టాండ్ ఎదురుగా పెద్ద పెద్ద గుంతలు పడటంతో ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపు నీరంతా ఆ గుంతల్లో చేరింది. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు కూడా బస్టాండ్ లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఏ ఒక్క ఆర్టీసీ బస్సు కూడా బస్టాండ్‌లోకి వెళ్లడం లేదు. బస్టాండ్ ఆవరణ అధ్వానంగా మారింది. ఆర్టీసీ అధికారులు మాత్రం ఏ నాడు పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు అన్నాభిషేకం

ఆత్మకూరు: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మంజునాథ స్వామికి అన్నాభిషేకం చేస్తామని ఆలయ ఈఓ అక్కిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పకడ్బందీగా ఓటరు సర్వే



సర్వేపై ఆరా తీస్తున్న తహసీల్దార్ విజయకుమారి

రాప్తాడు: ఇంటింటా ఓటరు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ విజయకుమారి సూచించారు. మండలం కేంద్రంలో శనివారం బీఎల్‌ఓలు చేస్తున్న ఇంటింటా సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులతో పాటు ఇప్పటి వరకు ఓటు హక్కు పొందని వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సేకరించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. 2025లో జరిగే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఓటర్ సర్వేను పక్కాగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఈడీటీ మల్లికార్జున, ఆర్‌ఐ హేమ, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, వీఆర్వో లక్ష్మన్న, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

చిన్ని కృష్ణుల సందడి



ఆత్మకూరులో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు

ఆత్మకూరు: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం మినీ కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు వేయించారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, సందడిగా గడిపారు.

వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



వెన్నపూస రవీంద్రా రెడ్డి, పంచాయితీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వెన్నపూస రవీంద్ర రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.



నడవడానికి వీలు లేకుండా ధ్వంసమైన వాకర్



తెగిపోయిన ఊయల



ఆట పరికరం చుట్టూ చేరిన వర్షపు నీరు

కళావిహీనంగా పంపనూరు సిటీ పార్క్

- ధ్వంసమైన ఆట పరికరాలు
- ఆదాయం ఉన్నా పట్టించుకోని అధికారులు



పిల్లలు ఆడుకునే వీల్‌లో ధ్వంసమైన కుర్చీలు





చిన్నారులు జారే జారుడు పరికరం పరిస్థితి ఇలా.

ఆత్మకూరు: జిల్లా కేంద్రానికి సమీపంలో పంపనూరు వద్ద ఏర్పాటు చేసిన సిటీ పార్క్ కళావిహీనంగా తయారైంది. సిటి పార్క్‌లో ఉండే ఆటపరికరాల్లో దాదాపు అన్ని ధ్వంసం అయ్యాయి. పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు, ఊయలలు, నడిచే వాకర్లు, పిల్లలు జారే జారుడు పరికరాలు అన్ని పనికి రాకుండా పోయాయి. దీంతో చిన్న పిల్లలతో వచ్చే పర్యాటకులు కేవలం వాతావరణాన్ని ఆహ్లాదించడం తప్ప ఆడుకునే అవకాశం లేకుండా పోతోంది. అంతేకాకుండా కొన్ని ఆట పరికరాల వద్ద వర్షం వస్తే చుట్టూ వర్షపు నీరు నిలబడుతోంది. అటవీ శాఖ అధికారులు స్పందించి కొత్త ఆట పరికరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఆహ్లాదం కనుమరుగు..

250 హెక్టార్లకు పైగా ఉన్న అటవీ ప్రాంతంలో అధికారులు సిటీ పార్క్ ఏర్పాటు చేయించారు. ఈ పార్క్‌లో గతంలో అన్ని సౌకర్యాలను కల్పించారు. పర్యాటకులు సంతోషంగా, ఆనందంగా కుటుంబంతో గడపడానికి వీలు ఉండేలా అన్ని ఆట పరికరాలు ఏర్పాటు చేయించారు. కానీ ప్రస్తుతం సిటీ పార్క్‌లోని ఆట పరికరాల పరిస్థితి అధ్వాన స్థితికి చేరుకుంది. ఆదాయం ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.

రూ.20 టికెట్..

జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ఒకటి. ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి రోజూ వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇక ఆదివారం, మంగళవారాలు అయితే ఎన్నో వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారు. ఆలయానికి వచ్చే చాలా మంది ఆనందం, కాలక్షేపం కోసం సిటీ పార్క్‌కు వస్తుంటారు. ఎప్పుడు సిటీ పార్క్ పర్యాటకులతో కళకళలాడుతుంటుంది. పార్క్ లోపలికి వెళ్లడానికి రూ.20 టికెట్ తీసుకుంటున్నారు. ఒక నెలకు దాదాపు రూ.లక్ష వరకూ సిటీ పార్క్ నుంచి ఆదాయం సమకూరుతోంది.

కృష్ణాష్టమి వేడుకలకు తరలిరండి

అనంతపురం కల్చరల్: చిన్నారుల కృష్ణవేషధారణలతో కృష్ణాష్టమి వేడుకలను మరింత అందంగా మార్చడానికి అనేక కళావేదికలు, ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు లలిత కళాపరిషత్తు వేదికగా శ్రీనృత్య కళానిలయం, సాయిట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో 'సాయి గోకులం' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు విజయ్‌కుమార్, నాట్యాచార్యులు సంధ్యామూర్తి తెలిపారు. చిన్నారులందరినీ భాగస్వామ్యం చేయడానికి నాటి రేపల్లెను తలపించే ఉట్టికొట్టడం, బృందావనంలో గోపికల విహారం వంటి ఘట్టాలతో గోకులాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో..

రామనగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో భావసార క్షత్రియ మహిళా మండలి 14వ వార్షికోత్సవంతో పాటూ శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మహిళా మండలి అధ్యక్షురాలు మహేంద్రకర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం సాయంత్రం దైహండి (ఉట్టి) దాండియా వేడుకలు, శ్రీకృష్ణగోపికల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా జరుగుతాయని చిన్నారులందరికి బహుమతులు అందజేస్తామన్నారు.

రేపు వాల్మీకుల బైక్ ర్యాలీ

అనంతపురం టవర్‌క్లాక్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కేశవ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చారని తెలిపారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం బీసీలుగా చేర్చడం దారుణమన్నారు. వాల్మీకులు ఐక్యమత్యంగా ఉంటూ ఎస్టీ జాబితాలోకి చేర్చే వరకు పోరాడాలన్నారు. ఇందుకోసం ఈనెల 26న నగరంలో వాల్మీకులతో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే అదే రోజు వాల్మీకి కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 27న వాల్మీకి కళ్యాణ మండపంలో ఎస్టీ జాబితా చేర్చేందుకు కార్యాచరణ ఏర్పాటు చేస్తామన్నారు. వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షుడు మాధవయ్య, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు కసుమ ప్రభాకర్, నాయకులు మేకల గోవిందు, నాగార్జున, అనిల్ కుమార్, సాకే మధు, తలారి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా



మాంటిస్సోరి స్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు



మినర్వా స్కూల్‌లో విద్యార్థుల సందడి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని వివిధ స్కూళ్లల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల ఆవరణాలను రంగురంగుల కాగితాలు, మామిడి తోరణాలు, ముగ్గులతో అలంకరించారు. చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. కోలాటం ప్రదర్శించారు. కృష్ణాష్టమి విశిష్టత, కృష్ణుడి లీలలు, కృష్ణుని వైభవాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. చిన్నారులు ఉట్టి కొట్టే ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

అనంతపురం సెంట్రల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 ఇసుక ట్రాక్టర్లను ఇటుకలపల్లి పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. స్థానికంగా ఉన్న పండమేరు వంక నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మత్తుతో భవిష్యత్ చిత్తు

చెన్నేకొత్తపల్లి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకోవాలని సెబ్ సీఐ లలితాదేవి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరైనా మాదక ద్రవ్యాలను అక్రమంగా విక్రయిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మాదక ద్రవ్యాలను భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు.

ప్రకృతి పరవశం



చుట్టూ పచ్చని పంట పొలాలు, ఆ పక్కనే గాలి మరలు, మధ్యలో చెరువు నీటితో ఆత్మకూరు మండలం వై.కొత్తపల్లి నుంచి సింగంపల్లి గ్రామానికి వెళ్లే రహదారి చూపరులను ఆకట్టుకుంటోంది. శనివారం నల్లని మబ్బులతో మేఘాలు కమ్ముకున్నాయి. తుంపర చినుకులు పడి వాతావరణం చల్లగా మారడంతో స్థానికులు అక్కడికి వెళ్లి సేదదీరారు.

– ఆత్మకూరు:

కృష్ణాష్టమికి ముస్తాబు

- ఇస్కాన్ మందిరంలో ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలు



అలంకరణలో రాధాకృష్ణులు

అనంతపురం కల్చరల్: ఇస్కాన్ మందిరం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సిద్ధమైంది. సనాతన ధర్మానికి ప్రతిరూపంగా నిలచిన ఈ మనోహర శిల్పరాజం జిల్లాకే తలమానికంగా నిలిచింది. ఆలయాన్ని ఇప్పటికే విద్యుద్దీప కాంతులతో అలంకరించారు. పురాణ ఇతిహాసాల్లో ప్రసిద్ధి చెందిన వివిధ ఘట్టాలు, మందిరం చుట్టూ అందంగా పాలరాతితో నిర్మించిన సుందర విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మందిరంలో ముందు భాగంలో సుమారు 60 అడుగుల ఎత్తులో నిర్మించిన నాలుగు అశ్వాలు రథంలా నిర్మితమైన సుందర మందిరాన్ని లాగుతున్నట్టు ఏ మూల నుంచి చూసినా భక్తులకు మధురానుభూతి కలిగిస్తోంది. సనాతన ధర్మాన్ని, హైందవ మత సంస్కృతి సౌరభాలను వెదజల్లుతున్నట్లు మందిరంలోని అణువణువు కృష్ణశబ్దతో ప్రతిధ్వనిస్తూ మరో అపురూప వేడుకకు ముస్తాబైంది.

తెల్లవారుజాము నుంచే పూజలు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు ఆలయ మేనేజర్ దామోదర్ ప్రభుదాస్ తెలిపారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో పెద్ద ఎత్తున వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 4:30 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. విశ్వశాంతి మహాయజ్ఞం, ఉట్టి ఉత్సవం, రాత్రి ఊంజలసేవ నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం రాధాకృష్ణులకు మహాకుంభాభిషేకం, చివరి రోజున శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ప్రభుపాదుల విశేషస్మరణ, మహాకుంభాభిషేకం, సాయంత్రం నగర సంకీర్తన జరుగుతాయని వెల్లడించారు. చిన్నారులను శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో అలంకరించి వేడుకల్లో పాల్గొనాలని జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు కోరారు.

గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని హరియాన్‌చెరువు గ్రామంలో శనివారం ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ సిబ్బంది గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు సోకే అవకాశం ఉందని తెలిపారు. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు వెంకటేష్, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, ఆశాకార్యకర్త మీనాక్షి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కియా సెల్టాస్ ఐదవ వార్షికోత్సవం



బహుమతి అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: ఆటో మొబైల్ రంగంలో విశేష ఆదరణ కలిగిన కియా కంపెనీ సెల్టాస్ 5వ వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. శనివారం జాతీయ రహదారిలోని ఎంజీ బ్రదర్స్ కియా షోరూంలో అత్యధిక మైలేజ్ సాధించిన విజేతకి రూ.10 వేలు విలువైన యాక్ససరీస్ అందజేశారు. కార్యక్రమంలో ఎంజీ బ్రదర్స్ కియా సీఈఓ ఆదిత్య మాచాని, పీవీకేకే ప్రిన్సిపాల్ వైభవ్, జనరల్ మేనేజర్ ఎల్లప్ప, జీఎం గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో సౌకర్యాలు కల్పించాలి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం బంజారాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి బన్సోత్ చక్రీ నాయక్ పేర్కొన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి తమకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అపాయింట్‌మెంట్ దొరకలేదన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలకు కలవడానికి వీలుకాకపోవడంతో లేఖలు రాయడం జరిగిందన్నారు. 15 లక్షల మంది బంజారుల సమస్యలను ఎవరితో చెప్పుకోవాలన్నారు. బంజారాలకు రాజకీయ ప్రాధాన్యత లేకపోవడంతోనే ఇప్పటికీ వెనుకబడ్డారని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల్లో బంజారాలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతి అయిన ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. రూ.వేల కోట్లు విలువ చేసే హథిరామ్ జీ మఠం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. గత 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న బంజరు భూములకు పట్టాలు మంజూరు చేయాలన్నారు.

జీజీహెచ్‌కు లైట్ల వితరణ



డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలతకు లైట్లు అందిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పీజీ వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్ల భద్రతలో భాగంగా ప్రభుత్వ లైట్లను డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలతకు మేయర్ వసీం అందించారు. ఇటీవల మేయర్ వసీం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పీజీ వైద్య విద్యార్థులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెల్పిన విషయం విధితమే. లైట్లు లేవని పీజీ విద్యార్థులు మేయర్‌కు విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందులో భాగంగా శనివారం నగరపాలక సంస్థలో జీజీహెచ్ డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలతకు లైట్లు అందజేశారు.



ఆర్‌ఎఫ్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు



బాబా మందిరంలో వ్రతం ఆచరిస్తున్న మహిళలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతం



అలంకరణలో వెంకయ్య స్వామి

ఆలయాల్లో శ్రావణ శోభ

నగరంలోని వైష్ణవాలయాల్లో శ్రావణ మాస సందడి నెలకొంది. మూడవ శ్రావణ శనివారం కావడంతో భక్తులు బారులు దీరి పలు చోట్ల సామూహిక వ్రతాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాల్ నగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరం, ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఏడు శనివారాల వ్రతాలు కన్నుల పండువగా జరిగాయి. మహిళలు ఏకరూప దుస్తుల్లో బారులు తీరి స్వామివారి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అలాగే పాతూరు చెరువు కట్టపై వెలసిన వెంకయ్య స్వామి ఆరాధన ఉత్సవాలు వేడుకగా జరిగాయి. స్వామికి ప్రత్యేక పూజలతో పాటూ వందలాది మందికి అన్నదానం చేశారు. శివబాలయోగి ఆశ్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. ఉదయం వేంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, తులసి అర్చన, అడ్డుపడి పూజలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అలాగే పలుచోట్ల నాగులకట్టల వద్ద భక్తులు పాలు పోసి నాగదేవతలను పూజించుకున్నారు.

– అనంతపురం కల్చరల్: